క్లుప్తంగా

పాఠశాలలకు పుస్తకాల పంపిణీ



పెనుగంచిప్రోలు: వేసవి సెలవులు ముగిసి ఈనెల 12వ తేదీన పాఠశాలలు తెరుచుకోనున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలకు ఎంఈఓ డీ రవీంద్ర ఆధ్వర్యంలో పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ మండలంలో మొత్తం 33 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా అందులో 2,569 మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. వీరికి మొదటి సెమిస్టర్‌కు సంబంధించి 10,814 పాఠ్య పుస్తకాలు, 1,788 వర్క్‌బుక్స్, 15,090 నోట్‌బుక్స్ వచ్చాయన్నారు. అలాగే ఒకటో తరగతి విద్యార్థులకు 205, 6వ తరగతి విద్యార్థులు 229 మందికి అవసరమైన డిక్షనరీలు కూడా వచ్చాయన్నారు. 2,569 మంది విద్యార్థులకు బ్యాగ్స్ రాగా, యూనిఫాం, షూస్ రావాల్సి ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

విద్యామిత్ర కిట్ల పంపిణీ

జగ్గయ్యపేట అర్బన్: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లను విద్యార్థులకు అందించేందుకు మంగళవారం స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్‌లో మండలానికి చెందిన 62 పాఠశాలలకు ఎంఈఓ ఎల్.చిట్టిబాబు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 12 నుంచి విద్యార్థులకు కిట్లను పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బాలుర హైస్కూల్ హెచ్ఎం పి.నాగేశ్వరరావు, చిల్లకల్లు జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం మణిమాల రమణ, ఉపాధ్యాయులు కృష్ణయ్య, సీఆర్పీలు పాల్గొన్నారు.

మోడల్ ప్రాథమిక పాఠశాల ప్రారంభం

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని జీవీజే జెడ్పీ బాలుర హైస్కూల్‌లో ఈ విద్యా సంవత్సరం నుంచి ఒకటి నుంచి ఐదో తరగతి వరకు మోడల్ ప్రాథమిక పాఠశాలను ప్రారంభించినట్లు ప్రాథమిక పాఠశాల విభాగం హెచ్ఎం జీ నిక్సన్ మంగళవారం తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచే అడ్మిషన్లు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఉచితంగా పాఠశాల పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, యూనిఫాంలు అందజేస్తామని చెప్పారు. అలాగే హాస్టల్ వసతి ఉందని పేర్కొన్నారు. విద్యార్థులు మోడల్ ప్రాథమిక పాఠశాలను ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.

నేడు దుర్గామల్లేశ్వరస్వామి శాంతి కల్యాణం

నందిగామ రూరల్: మండలంలోని పల్లగిరి గట్టుపై వేంచేసియున్న కనకదుర్గ, కనకమహాలక్ష్మి, జ్ఞాన సరస్వతీ అమ్మవార్ల ఆలయ దశమ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యుడు దుర్గాప్రసాద్, అర్చకుడు యనమదల రాజేష్ శర్మలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, మండపారాధన, అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృత, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, అగ్ని ప్రతిష్ఠాపన, మూల మంత్ర హోమాలు, మహాపూర్ణాహుతి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఆలయ ఆవరణలోని కల్యాణ మంటపంలో దుర్గామల్లేశ్వర స్వామివారి శాంతి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

జెడ్పీ హైస్కూల్‌గా ప్రాథమికోన్నత పాఠశాల

నందిగామ రూరల్: మండలంలోని చందాపురం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను ప్రభుత్వం జెడ్పీ హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేసిందని హెచ్ఎం రాజశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని కేతవీరునిపాడు గ్రామంలో ఉపాధ్యాయులతో కలిసి మంగళవారం ఆయన క్యాంపెయిన్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేతవీరునిపాడు గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమకోన్నత పాఠశాలను ప్రాథమిక పాఠశాలగా మార్చిందని పేర్కొన్నారు. దీంతో పాఠశాలలోని ఆరు, ఏడు, ఎనిమిది తరగతుల విద్యార్థులను తల్లిదండ్రులు చందాపురం జెడ్పీ పాఠశాలలో చేర్పించాలని కోరారు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దొంగతనం కేసులో ఐదుగురు అరెస్ట్

కంచికచర్ల: ఓ పాడుబడిన కర్మాగారంలో రెండు మిషన్లు దొంగిలించిన కేసులో మంగళవారం ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కీసర అగ్రిగోల్డ్ ఆర్గానిక్స్‌లో పాడుపడిన రెండు మిషన్లను రెండు వాహనాల ద్వారా తరలిస్తుండగా స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు రంగంలోకి దిగి మిషన్లను తరలిస్తున్న వాహనాలను పట్టుకున్నారు. దొంగతనం చేసిన ఐదుగురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

అరకొర వసతులతో అవస్థలు

- తెరుచుకోనున్న పాఠశాలలు
- నిలిచిపోయిన మనబడి నాడు – నేడు పనులు



పెనుగంచిప్రోలు కేఎల్ ప్రాథమిక పాఠశాలలో నిర్మాణంలో ఉన్న తరగతి గది

పెనుగంచిప్రోలు: వేసవి సెలవుల అనంతరం ఈనెల 12వ తేదీన పాఠశాలలు తెరుచుకోనున్నాయి. అయితే ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు మాత్రం నేటికీ పూర్తి కాలేదు. ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు కల్పించాలని, వాటిలో చదివే పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యనందించాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మనబడి నాడు – నేడు పథకం కింద పాఠశాలల ఆధునీకరణ పనులు చేపట్టింది. గతంలో శిథిలావస్థకు చేరిన పాఠశాలలను మొదటి విడతలో కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా అభివృద్ధి చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, విద్యాబోధనపై విద్యార్థుల తల్లిదండ్రులకు గట్టి నమ్మకం ఏర్పరిచారు. అదేవిధంగా రెండో విడతలో కూడా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపిక చేసి నిధులు మంజూరు చేశారు. అయితే అనంతరం ఎన్నికల కోడ్ కారణంగా పనులు నిలిచిపోయాయి.

పట్టించుకోని కూటమి ప్రభుత్వం

ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి పనులను పట్టించుకోవడం లేదు. దీంతో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి అతీగతీ లేకుండా పోయింది. దీంతో పేద విద్యార్థులు అరకొర వసతులతో అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని పాఠశాలల్లో గదులు పూర్తయినప్పటికీ గచ్చులు, కిటికీలు, రంగులు వేయకుండా కాలయాపన చేస్తున్నారు. దీనిపై అడిగితే అధికారులు పలు కారణాలు చెబుతున్నారు. దీంతో అరకొర వసతుల మధ్య ఇబ్బందులు తప్పవని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు.

చిన్న చిన్న పనులు కూడా పూర్తి చేయలేదు

మండలంలో మనబడి నాడు – నేడు కార్యక్రమంలో భాగంగా మొదటి ఫేజ్‌లో 16 పాఠశాలలకు రూ.3.45 కోట్లు, రెండవ ఫేజ్‌లో 31 పాఠశాలలకు రూ.11,41,95,000 మంజూరు అయ్యాయి. మండలంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే అన్నీ పాఠశాలలో నాడు – నేడు కింద పనులు పూర్తయ్యాయి. ఉన్నకొద్ది పాటి పనులు కూడా ఎన్నికలైన తర్వాత కూటమి ప్రభుత్వంలో పూర్తి చేయలేదని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. పెనుగంచిప్రోలు కేవీఆర్ జెడ్పీ హైస్కూల్‌లో గదుల నిర్మాణం పూర్తయినా పెయింటింగ్స్, ఎలక్ట్రిఫికేషన్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. పెనుగంచిప్రోలు కేఎల్ ప్రాథమిక పాఠశాలకు ఎస్ఎస్ఏ ప్లాన్ ఆఫ్ యాక్షన్ కింద రెండు గదులకు రూ.22 లక్షలు మంజూరు కాగా ఒక్క గది మాత్రమే పూర్తయింది. మరో గది నిర్మాణంలో ఉంది. నాడు – నేడు పనుల్లో భాగంగా తోటచర్ల యూపీ స్కూల్‌లో గది నిర్మాణం జరగాల్సి ఉంది. పెనుగంచిప్రోలు బాలికల హైస్కూల్‌లో టాయిలెట్ బ్లాక్ అసంపూర్తిగా మిగిలింది. అలాగే దాదాపు అన్ని పాఠశాలల్లో పెయింటింగ్స్ పూర్తి కాలేదు. తలుపులు, కిటికీలు ఇతర చిన్న చిన్న పనులు పెండింగ్‌లో ఉన్నాయి.



అసంపూర్తిగా పెనుగంచిప్రోలు బాలికల హైస్కూల్‌లో టాయిలెట్ బ్లాక్

తక్షణం పూర్తి చేయాలి



పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను తక్షణం పూర్తి చేయాలి. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎంతో కృషి చేసింది. పాఠశాలల్లో 9 రకాల వసతులు కల్పించింది. కాబట్టి కూటమి ప్రభుత్వం కూడా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి కృషి చేయాలి.

– మెండెం రామారావు, పెనుగంచిప్రోలు

చర్యలు తీసుకుంటాం

మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు దాదాపు పూర్తయ్యాయి. పెయింటింగ్స్, ఎలక్ట్రిఫికేషన్ తదితర చిన్న చిన్న పనులు పూర్తి కావాల్సి ఉంది. కాంట్రాక్టర్స్ పెండింగ్‌లో పెట్టారు. జరుగుతున్న నిర్మాణ పనులు, ఇతర పనులు కూడా త్వరగా పూర్తి అయ్యేలా చర్యలు చేపడతాం.

– ప్రసాద్, ఎస్ఎస్ఏ ఏఈ

నేడు కౌలు వేలం పాటలు

నందిగామ రూరల్: మండలంలోని ఆయా గ్రామాల్లో గల ఆలయాలకు సంబంధించిన వ్యవసాయ భూములకు బుధవారం టెండర్ కం బహిరంగ కౌలు వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు గ్రూప్ టెంపుల్స్ ఈఓ గంగాధర్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన వివరాలు తెలిపారు. మండలంలోని అంబారుపేట గ్రామంలో వేంచేసియున్న ఓంకారేశ్వర స్వామివారి ఆలయానికి చెందిన 6.94 ఎకరాలకు బుధవారం ఉదయం 11 గంటలకు ఆలయ ఆవరణలో కౌలు వేలం పాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా మండలంలోని ఐతవరం గ్రామంలో వేంచేసియున్న ఆంజనేయస్వామివారి ఆలయ ఆవరణలో ఆలయానికి చెందిన 5.50 ఎకరాలకు మధ్యాహ్నం 12 గంటలకు, కంచికచర్ల మండలం చెవిటికల్లు గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఉదయం 10 గంటలకు ఆలయానికి చెందిన 6.94 ఎకరాలకు కౌలు వేలం పాట జరుగుతుందని వివరించారు. దేవదాయ శాఖ నిబంధనలకు అనుగుణంగా జరిగే కౌలు వేలం పాటల్లో ఆసక్తి కలిగిన రైతులు పాల్గొనాలని ఆయన కోరారు.

కంప్యూటర్ శిక్షణ సర్టిఫికెట్లు అందజేత

నందిగామ టౌన్: సుజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా అందిస్తున్న కంప్యూటర్ తదితర శిక్షణలను గ్రామీణ ప్రాంత యువత, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఫౌండేషన్ కోఆర్డినేటర్ కొంగర దుర్గాప్రసాద్ కోరారు. స్థానిక సుజనా ఫౌండేషన్ స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రంలో కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసుకున్న 25 మందికి మంగళవారం సర్టిఫికెట్లు అందజేశారు. కంప్యూటర్ ట్రైనర్‌లు రామకిషోర్, విరజ, కోమలి తదితరులు పాల్గొన్నారు.

పాలన చేతకాకనే డైవర్షన్ పాలిటిక్స్

- మహిళలకు రక్షణ కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలం
- వైఎస్సార్ సీపీ మహిళా నేతల ఆగ్రహం



మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజున్నీసా ఫిరోజ్, మహిళా నేతలు

జగ్గయ్యపేట అర్బన్: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, అఘాయిత్యాలను కప్పిపుచ్చుకునేందుకు డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతోందని వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ మహిళా నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆ పార్టీ మహిళా విభాగం నేతలు మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ హఫీజున్నీసా ఫిరోజ్, పార్టీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు సుశీల, అంగన్‌వాడీ విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు శ్యామల తదితర మహిళా నేతలు మాట్లాడుతూ రాష్ట్రంలో వరుసగా మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు, దాడులు జరుగుతుంటే ప్రభుత్వం, పోలీసుల్లో ఎందుకు చలనం లేదని ప్రశ్నించారు. అనంతపురంలో ఇంటర్ చదువుతున్న గిరిజన బాలికను బీర్ బాటిల్‌తో కొట్టి చంపితే ఇంత వరకు కదలిక లేదని మండిపడ్డారు. తన కుమార్తె కనిపించడం లేదని జూన్ మూడవ తేదీనే బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అలాగే అనంతపురం జిల్లాలో తొమ్మిదో తరగతి దళిత విద్యార్థినిని 14 మంది టీడీపీ యువకులు నెలల పాటు దారుణంగా అత్యాచారం చేసి వేధించినా నిందితులపై ఎందుకు చర్యలు తీసుకోలేదని నిలదీశారు. ఈ ఘటనలో బాధితురాలికి ఇంత వరకు న్యాయం జరగలేదని పేర్కొన్నారు. కూటమి పాలనలో మహిళలపై జరుగుతున్న దారుణాలను సాక్షి మీడియా ఎప్పటికప్పుడు బయటపెడుతుంటే కూటమి ప్రభుత్వానికి వణుకు పుడుతోందని, అందుకే సాక్షి మీడియాను ముఖ్యమంత్రి చంద్రబాబు టార్గెట్ చేశారని విమర్శించారు.

శాంతి భద్రతల పరిరక్షణలో విఫలం

శాంతి భద్రతల పరిరక్షణలో సీఎం చంద్రబాబు, హోంమంత్రి అనిత దారుణంగా విఫలమయ్యారని మండిపడ్డారు. ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 30 వేల మంది మహిళలకు కిడ్నాప్‌కు గురయ్యారని చెప్పిన పవన్ కల్యాణ్.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా వారి ఆచూకీ ఎక్కడ అంటూ చురకలు వేశారు. మరోవైపు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన కూటమి ప్రభుత్వం వాటి నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికే డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట పట్టణ అధ్యక్షురాలు షేక్ మున్నీహీరా, నియోజకవర్గ మహిళా నేతలు పుల్లంశెట్టి పద్మావతి, పత్తిపాటి అన్నమ్మ, దారెల్లి పద్మ, కూచిపూడి కమలమ్మ, సంధ్య, జ్యోతి, దేవకరుణ, దేవి, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నందిగామ మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు

నందిగామ టౌన్: సమాన పనికి సమాన వేతనాన్ని తక్షణమే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ డిమాండ్ చేశారు. మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగంలో పని చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట మంగళవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో కార్మికులు దుర్భర జీవితాన్ని గడుపుతున్నారని చెప్పారు. ముఖ్యంగా కార్మికులకు వేతనాలు పెంచాలని, మున్సిపల్ ఇంజినీరింగ్, పారిశుద్ధ్య కార్మికులకు పీఆర్సీ వేతనాలు, కరువు భత్యం, ఐఆర్, ఇంజినీరింగ్ కార్మికులకు టెక్నికల్, నాన్ టెక్నికల్ వేతనాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని లేకుంటే సమ్మెలోకి వెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ నాయకులు సైదా, కండెల శ్రీను, పరిమి రవి, దాసు, శ్రావణ్, బేబి, పల్లెకంటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



బోడవాడలో మానవహారంగా ఏర్పడిన బాలికలు, అంగన్‌వాడీ సిబ్బంది



అవగాహన కల్పిస్తున్న సర్పంచ్ పద్మకుమారి, సూపర్‌వైజర్ ఉషారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు



కంచికచర్లలో మానవహారంలో పాల్గొన్న ఐసీడీఎస్ అధికారులు, కిశోర బాలికలు

వీరులపాడు: బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వైద్యాధికారి డాక్టర్ నందిని పేర్కొన్నారు. మండలంలోని బోడవాడ గ్రామంలో కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం బాల్య వివాహాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై తల్లిదండ్రులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలతో స్నేహపూర్వకంగా మెలగడంతోపాటు ఉన్నత విలువలను పెంపొందించాలని తెలిపారు. ముఖ్యంగా బాల్య వివాహాల వల్ల బాలికలలో శారీరక సమస్యలు అధికమవుతాయని సూచించారు. యుక్త వయసు వచ్చిన తర్వాతనే వివాహాలు చేయాలని తల్లిదండ్రులకు సూచించారు. అదేవిధంగా జుజ్జూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభావతి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్‌లతో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త సుజాత, బాలికల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనారోగ్య సమస్యలు

పెనుగంచిప్రోలు: సమాజంలో నేటికీ అక్కడక్కడా జరుగుతున్న బాల్య వివాహాలను పూర్తి స్థాయిలో అరికట్టాలని సర్పంచ్ వేల్పుల పద్మకుమారి పేర్కొన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం కిశోర బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల బాలికల్లో అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. బాలికలను తల్లిదండ్రులు ఉన్నత చదువులు చదివించాలని సూచించారు. అనంతరం కిశోర బాలికలకు యోగాసనాలు నేర్పించడంతోపాటు వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వీడియోల ద్వారా చూపించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పెనుగంచిప్రోలు సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కిశోరి వికాసం

కంచికచర్ల: కిశోరి వికాస వేసవి శిక్షణా తరగతులు ముగిసాయని ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మీభార్గవి తెలిపారు. మంగళవారం ముగింపు సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి పెట్రోలు బంక్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. లీగల్ అడ్వైజర్ కట్టా కిరణ్‌కుమార్ పోక్సో చట్టం, పలు సెక్షన్‌లను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కరీమాబీ, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

నందిగామ రూరల్: కిశోరి వికాసం ముగింపు సందర్భంగా పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం అవగాహన ర్యాలీ చేసి మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మీభార్గవి మాట్లాడుతూ బాల్య వివాహాలు నేరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు వెంకట్రావమ్మ, కరుణకుమారి, తారాబీ, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

పలువురు ఉద్యోగులు బదిలీ

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో పని చేస్తున్న నలుగురు ఉద్యోగులు బదిలీ అయ్యారు. దీనికి సంబంధించి ఆలయ అధికారులకు దేవదాయశాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆలయ ఏఈఓలు జీ ఉమాపతి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం ద్వారకా తిరుమలకు బదిలీ కాగా, ఎం తిరుమలేశ్వరరావు విజయవాడ శ్రీదుర్గామల్లేశ్వర స్వామి ఆలయానికి బదిలీ అయ్యారు. వీరి స్థానంలో జంగం శ్రీనివాసరావు విజయవాడ నుంచి రానున్నారు. ఆలయ సూపరింటెండెంట్ ఎల్ శ్రీనివాసరావు కూడా విజయవాడ బదిలీ కాగా, విజయవాడ నుంచి కే లక్ష్మణ్ అతని స్థానంలో వస్తున్నారు. అలాగే ద్వారకా తిరుమల నుంచి సూపరింటెండెంట్ డీవీ నరసింహరాజు, విజయవాడ నుంచి సీనియర్ అసిస్టెంట్ బీ నాగేశ్వరరావు బదిలీపై పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మవారి ఆలయానికి వస్తున్నారు. ఆలయ జూనియర్ అసిస్టెంట్ ఎంఎస్ ప్రకాష్‌రావు పెనుగంచిప్రోలు నుంచి అన్నవరం శ్రీవీరవెంకట సత్యనారాయణస్వామి ఆలయానికి బదిలీ అయ్యారు.

బదిలీపై వెళ్తున్న పోలీస్ సిబ్బందికి సన్మానం

పెనుగంచిప్రోలు: బదిలీపై వెళ్తున్న సిబ్బందిని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఘనంగా సన్మానించారు. సాధారణ బదిలీల్లో భాగంగా హెడ్ కానిస్టేబుల్ ప్రకాష్, కానిస్టేబుళ్లు నరేస్‌కుమార్, సురేష్ ఇతర పోలీస్‌స్టేషన్‌లకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా వారిని సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎంఎస్‌కే అర్జున్, ఏఎస్ఐ ఎస్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



బదిలీపై వెళ్తున్న పోలీసు సిబ్బందిని సత్కరించిన ఎస్ఐ అర్జున్

వెంకటేశ్వరస్వామి ఆలయ ఈఓగా సాంబశివరావు

తిరుమలగిరి(జగ్గయ్యపేట): ప్రముఖ పుణ్యక్షేత్రం వాల్మీకోద్భవ వెంకటేశ్వరస్వామి ఆలయ ఈఓగా విజయవాడ దుర్గామల్లేశ్వరస్వామివారి ఆలయంలో అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్న నూతక్కి సాంబశివరావు రానున్నారు. ఈ మేరకు దేవదాయ శాఖ ఉన్నతాధికారులు మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఇప్పటి వరకు ఈఓగా పని చేసిన వరప్రసాద్ అంతర్వేదికి బదిలీ అయ్యారు.

నందిగామ మున్సిపల్ కమిషనర్ బదిలీ

నందిగామ టౌన్: ఇప్పటి వరకు నందిగామ పురపాలక సంఘ కమిషనర్‌గా పని చేసిన ఈవీ రమణ బాబు ప్రకాశం జిల్లా గిద్దలూరు కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో తిరువూరు పురపాలక సంఘ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న లోవరాజు నందిగామకు బదిలీపై రానున్నారు.

నష్ట పరిహారం చెల్లించాలని ఆందోళన



మైలవరం: మైలవరం మండలం చంద్రాల గ్రామంలో ఆర్అండ్‌బీ రహదారి విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారికి వెంటనే నష్టపరిహారం చెల్లించాలని బాధితులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం మైలవరం తహసీల్దార్ కార్యాలయం ముట్టడికి బాధితులు ప్రయత్నించారు. చంద్రాల గ్రామానికి చెందిన 65 మంది ఇళ్లు, మరికొంత మంది ఇళ్ల స్థలాలు కోల్పోయారు. 2016–17లో రోడ్డు విస్తరణ పనులు జరిగాయి. దీనికి సంబంధించి బాధితులకు సుమారు రూ.6.75 కోట్లు నష్ట పరిహారం చెల్లించాల్సి ఉంది. నాటి నుంచి నేటి వరకు నష్టపరిహారం అందకపోవడంతో వారు తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పీవీ ఆంజనేయులు, మండల కార్యదర్శి సీహెచ్ సుధాకర్ మాట్లాడుతూ నాడు మంత్రిగా ఉన్న దేవినేని ఉమామహేశ్వరరావు గానీ, నేడు ఎమ్మెల్యేగా ఉన్న వసంత వెంకట కృష్ణప్రసాద్ కానీ, స్థానిక ప్రజాప్రతినిధులు కానీ దీనిపై స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. తహసీల్దార్ కలెక్టర్ సమావేశంలో ఉన్నానని, 15 రోజులు గడువు కావాలని బాధితులకు సొమ్ములు జమయ్యేలా చర్యలు తీసుకుంటానని కార్యాలయంలోని డెప్యూటీ తహసీల్దార్, ఆర్అండ్‌బీ అధికారుల ద్వారా హామీ ఇచ్చారు. సీపీఎం నాయకులు వజ్రాల వెంకటరెడ్డి, బాధితులు శివప్రసాద్, అనిల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత



జగ్గయ్యపేటలోని ఇండోర్ స్టేడియంలో యోగా సాధన చేస్తున్న క్రీడాకారులు



లింగాలపాడు పీహెచ్‌సీలో యోగా సాధన చేస్తున్న వైద్యులు, సిబ్బంది

జగ్గయ్యపేట అర్బన్: యోగాతో మానసిక ప్రశాంతత, శారీరక ఆరోగ్యం లభిస్తాయని యోగా గురువు లుగేంద్ర పిళ్లై అన్నారు. స్థానిక మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో స్టేడియం కమిటీ ఆధ్వర్యాన మంగళవారం చేపట్టిన భారతీయ యోగా సాధన, ఉపయోగాలు కార్యక్రమంలో యోగా గురువులు లుగేంద్ర పిళ్లై, లీలావతి పాల్గొని క్రీడాకారులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. జాతీయ క్రీడాకారుడు, కవి సరికొండ నరసింహరాజు సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో స్టేడియం కమిటీ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ నరసింహారావు, అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, రామమూర్తి, ఎస్‌పీ ఈఈ కిషోర్, రాజేంద్రప్రసాద్, నాగరాజు, ప్రసాద్, పాపారావు, ప్రేమ్, స్టేడియం కమిటీ సభ్యులు, క్రీడాకారులు పాల్గొని యోగా సాధన చేశారు.

నందిగామ రూరల్: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని లింగాలపాడు గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం యోగా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా గురువు గాడిపర్తి సీతారామారావు, వైద్యాధికారి గౌతమి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ నిత్య జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని చెప్పారు. యోగాంధ్ర కోఆర్డినేటర్లు కృష్ణమోహన్, కవిత, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలు అందించాలని వినతి



ఇబ్రహీంపట్నం: ఖరీఫ్ సీజన్‌లో పచ్చిరొట్ట విత్తనాలు 90 శాతం సబ్సిడీపై సకాలంలో అందించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్నీడి యలమందరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఇబ్రహీంపట్నంలో డెప్యూటీ తహసీల్దార్ మహేష్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాలతో పాటు వరి వంగడాలు సైతం 90 శాతం సబ్సిడీపై రైతులకు ఇవ్వాలని కోరారు. గ్రామ సభలు నిర్వహించి పొలం యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచి రైతులు, కౌలు రైతులకు ఎటువంటి హామీ లేకుండా రూ.2లక్షల వరకు రుణాలు మంజూరు చేయాలని కోరారు. రైతు సంఘం నాయకులు నిమ్మగడ్డ వాసు, మల్నీడి రవి పాల్గొన్నారు.